క్లుప్తంగా

కళావతి విజయం తథ్యం



మాట్లాడుతున్న లిల్లీ పుష్పనాథం

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి విజయానికి ఢోకాలేదని పార్టీ సీనియర్ నాయకుడు, నగర పంచాయతీ మాజీ కమిషనర్ లిల్లీ పుష్పనాథం అన్నారు. స్థానిక కస్పావీధిలో దళిత సంఘాల నాయకులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రెండు దఫాలు నియోజకవర్గ ప్రజల అభిమానాన్ని పొంది ఎమ్మెల్యేగా గెలుపొందిన కళావతమ్మ మరోమారు విజయాన్ని సాధించడం తథ్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆమెకు మద్దతు తెలుపుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో కళావతమ్మ రాజకీయాలకు అతీతంగా వ్యవహరించిన తీరు ఆమె గెలుపునకు నాంది అన్నారు. కూటములు, కుట్రలు ఫ్యాన్ ప్రభంజనానికి చెల్లాచెదురవ్వడం ఖాయమన్నారు.

మద్యం షాపులకు తాళాలు

భామిని: మండలంలోని బత్తిలి, భామినిలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు శనివారం సాయంత్రం నుంచి మూతపడ్డాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయం దగ్గరపడటంతో నిబంధనల మేరకు అధికారులు మద్యం షాపులను మూసివేయించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు తెరుచుకోవు.

పోలింగ్ కేంద్రాలు సిద్ధం



లివిరి పోలింగ్ బూత్

భామిని: ఈ నెల 13న జరగనున్న సాధారణ ఎన్నికలకు మండలంలో 44 పోలింగ్ బూత్‌లను అధికారులు సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 38,003 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళా ఓటర్లు 9,347 మంది, పురుష ఓటర్లు 18,656 మంది ఉన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. తాగునీరు, బెంచీలు, మరుగుదొడ్లు, ఇతర ఫర్నీచర్‌ను సిద్ధం చేశారు. బురుజోలలో పాఠశాల భవనం నిర్మాణంలో ఉండడంతో రైతుభరోసా కేంద్ర భవనంలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు.

కూటమిని పడగొడదాం..
హ్యాట్రిక్ విజయం సాధిద్దాం..



లంబగూడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

సీతంపేట: కూటమిని పడగొడదాం.. హ్యాట్రిక్ విజయం సాధిద్దామని పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని లంబగూడ, కురిసింగి, తురాయిమానుగూడ, అచ్చిబ, నీలమ్మగూడ, తలైబుగూడ గ్రామాల్లో శనివారం విస్తతంగా ప్రచారం చేశారు. జగనన్న ఐదేళ్ల పాలనలో అద్భుత పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరిచారన్నారు. దొంగకు దొంగ తోడు అన్నట్టుగా మాయ కూటమి పేరుతో చంద్రబాబు మూడు జెండాలతో వస్తుంటే.. జగనన్న ఒకే జెండాతో ప్రజల అండదండలతో ముందుకు సాగుతున్నామన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే గిరిజన పల్లెలు మరింత అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. సోమవారం జరిగే ఓటింగ్‌లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా, తనూజారాణిని ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతంపేట: నాయకమ్మగూడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు



పాలకొండ రూరల్: బియ్యాలవలసలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రాంబాబు



పాలకొండ రూరల్: లుంబూరులో ప్రచారం చేస్తున్న మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు ఉపేంద్రకుమార్, తదితరులు

సంక్షేమ పాలనకు మద్దతుగా..

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రంతో తెరపడింది. చివరి రోజు కావడంతో ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఏవిధంగా మోసం చేశారో గుర్తుచేశారు. కూటమి హామీలు బూటకమి, వాటిని నమ్మి మోసపోవద్దని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



భామిని: బత్తిలిలో ఇంటింట ప్రచారంలో ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, నాయకులు



భామిని: నేరడి-బిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పార్టీ కార్యకర్తలు



భామిని: సొలికిరిలో బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



భామిని: కాట్రగడ-బిలో ఇంటింట ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం



గరుగుబిల్లి: కొత్తపల్లిలో ఉపాధి పనుల వద్ద మాజీ సర్పంచ్ తేజేశ్వరరావు ప్రచారం



గరుగుబిల్లి: రావివలసలో ఇంటింటా ఎన్నికల ప్రచారంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు

మరో అవకాశమిస్తే మరింత అభివృద్ధి



కురుపాంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి

కురుపాం:

రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకి మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం చేసి, చూపిస్తామని వైఎస్సార్ సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పూతికవలస, సీతంపేట, కస్పాగదబవలస, పాతకురుపాం, కాలందొరవలస గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆమెకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె ఈ ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే తన హయాంలో కురుపాం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని తెలిపారు. గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతీ గ్రామంలో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు గ్రామీణులకు రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. వీటితో పాటు మండల కేంద్రంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం, ఆస్పత్రి అదనపు గదుల నిర్మాణం చేపట్టామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చి, ఓట్లు కోసం వస్తున్న వైఎస్సార్ సీపీని నమ్మాలని, మోసపూరిత హామీలతో అధికారంలోకి రావాలనుకుంటున్న టీడీపీని నమ్మవద్దని కోరారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, ఎమ్మెల్యేగా తనను ఎంపీగా తనూజారాణిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కురుపాం గ్రామ సర్పంచ్ జి.సుజాత, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీలు బంగారునాయుడు, స్వామియాజులు, సంతోషిరాణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

పాలకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పిలుపునిచ్చారు. మండలంలో లుంబూరు పంచాయతీ గురుబిల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అల్లు జనార్దననాయుడుతో పాటు మరికొన్ని కుటుంబాలు శనివారం ఎమ్మెల్సీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి విక్రాంత్‌తో పాటు మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్, పాలకవర్గ సభ్యులు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పడాల రామచంద్రరావు, నెల్లి నాగభూషణరావు, తిర్లంగి సింహాచలం, తదితరులున్నారు.

- **సీతంపేట:** మండలంలోని చిన్నబగ్గకాలనీలో 15, తోటగూడ గ్రామానికి చెందిన 13 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్ సీపీ పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు.



జనార్దననాయుడును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

